క్లుప్తంగా

త్వరితగతిన పీఎంఏవై ఇళ్లు పూర్తి



తామరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ శ్రీఫణి

మాకవరపాలెం: పీఎం ఆవాస్ యోజన గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శ్రీఫణి సూచించారు. తామరంలో శుక్రవారం ఇళ్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకుంటే నిధులు మంజూరయ్యే అవకాశం లేదన్నారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దశలవారీగా ఇళ్ల నిర్మాణం చేసిన లబ్ధిదారలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగన్నాథం, శ్రీను పాల్గొన్నారు.

వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎం.అలమండ సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దాడి జగన్ తెలిపారు. ఎం. అలమండ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన ప్రతి రైతుకు విత్తనాలు అందజేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పోతల వెంకటరావు, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రునాయుడు, స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌ను సత్కరిస్తున్న నూతన అధ్యక్షుడు పాణి శాంతారామ్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ గొలుగొండ మండల అధ్యక్షుడిగా నియమితులైన కొరుప్రోలు పాణి శాంతారామ్, పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గణేష్‌కు దుశ్శాలువ కప్పి, జ్ఞాపిక అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీ బాబ్జి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, పెద్దిరాజు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరామ్మూర్తి మృతి



శ్రీరామ్మూర్తి (ఫైల్)

కె.కోటపాడు : సింగన్నదొరపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారపాటి శ్రీరామ్మూర్తి(67) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరామ్మూర్తిని విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో భౌతికకాయాన్ని స్వగ్రామం సింగన్నదొరపాలెంకు శుక్రవారం తీసుకువచ్చారు. శ్రీరామ్మూర్తి భార్య నారపాటి సత్యవతి గతంలో కె.కోటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలిగా, సింగన్నదొరపాలెం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. శ్రీరామ్మూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

103 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి: రైవాడలో సామాజిక వారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 103 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ మరియా కంటి పరీక్షలు నిర్వహించారు. రైవాడలో సామాజిక వారధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ. రమణ, శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎం.చంద్రోఖర్ పాల్గొన్నారు.

నిలువ నీడలేక..

- అధ్వానంగా బస్ షెల్టర్లు
- నిరుపయోగంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువు
- మండుటెండలోనే ప్రయాణికుల నిరీక్షణ

ఒక వక్క ఎండలు... మరో వక్క వర్షాలు ప్రయాణికులను అవస్థలకు గురిచేస్తున్నాయి. మండలంలో చాలా బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో నిలువ నీడలేక ప్రయాణికులు చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. బస్సుల కోసం నిరీక్షించే సమయంలో ఎండలు మండినా, వర్షం పడినా తలదాచుకోడానికి పరుగులు తీయవలసిన దుస్థితి ఏర్పడింది. బస్సు షెల్టర్ల నిర్వహణ, పర్యవేక్షణను అధికారులు గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. అసలే అరకొర, ఆపై వేళకు రాని బస్సుల కోసం ప్రయాణికులు మండుటెండలో ఇబ్బంది పడుతూ, వానలో తడుస్తూ ఎదురు చూడవలసి వస్తోంది.



మన్యపురట్ల జంక్షన్‌లో బస్సు షెల్టరు లోపల నిల్వ ఉన్న నీరు

నాతవరం: నర్సీపట్నం –తుని ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రధాన జంక్షన్‌లో బస్సులు వచ్చేంతవరకు ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్సు షెల్టర్లు నిర్మించారు. అవి చాలా చోట్ల ఆక్రమణకు గురికాగా మరి కొన్ని శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్నింటిలో వర్షపు నీరు చేరి ప్రయాణికులు నిరీక్షించేందుకు వీలులేని విధంగా ఉన్నాయి. మన్యపురట్ల, రాజుపేట అగ్రహారం, ఎ.పి.పురం లింగంపేట, ఉప్పరగూడెం, కొత్త నాయుడుపాలెం తదితర గ్రామాల ప్రజలు నర్సీపట్నం, తుని పట్టణాలకు వెళ్లాలంటే మన్యపురట్ల జంక్షన్‌లోనే బస్సు ఎక్కాలి. ఈ జంక్షన్‌లో బస్సు షెల్టర్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని స్థానికులు ఎత్తు చేశారు. దీంతో ఏ మాత్రం వర్షం పడినా రోడ్డుపై ప్రవహించే నీరంతా బస్సు షెల్టరులోకి చేరి, రోజుల తరబడి నిల్వ ఉండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇక్కడ వేచి ఉండే ప్రయాణికులు చెట్ల కింద నిలుచోవలసి వస్తోంది. గాంధీనగరం బస్సు షెల్టర్‌ను ఓ వ్యక్తి ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఆ ఆక్రమణదారుడికి అనుమతిలోనే ప్రయాణికులు ఆ షెల్టర్‌లో నిరీక్షించవలసిన పరిస్థితి. ఎ.శరభవరం–తాండవ జంక్షన్‌లో బస్సు షెల్టరు శిథిలమై నిరుపయోగంగా మారింది. నాతవరంలో షెల్టరు ఆక్రమణకు గురైంది. ఇలా మండలంలో చాలా షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడని స్థితిలో ఉన్నాయి. బస్ షెల్టర్ల సమస్యలను మండల సర్వ సభ్య సమావేశంలో పలువురు సభ్యులు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.



ఆక్రమణ గురైన గాంధీనగరంలో బస్సు షెల్టరు

అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు



ఇటీవల జరిగిన మండల సమావేశంలో బస్సు షెల్టర్ల సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశాం. ఉన్నాతాధికారుల దృష్టికి కూడా తీసుకెళతాం. అప్పటికీ స్పందించకుంటే సభలో తీర్మానం చేసి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

ఆందోళన చేస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఏ సమస్యపై ఫిర్యాదు చేసినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. బస్సు షెల్టర్లు విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తాం.

మాకిరెడ్డి రాముునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి

జయహో జగన్నాథ

- మాడుగుల, చోడవరం,వడ్డాదిలలో ఘనంగా రథయాత్ర
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు



మాడుగులలో జగన్నాథస్వామి కొలువుదీరిన నూతన ఇంద్రద్యుమ్న హాల్



చోడవరంలో నిర్వహించిన రథయాత్రలో పాల్గొన్న భక్తులు



వడ్డాదిలో జగన్నాథస్వామి ఊరేగింపు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో జగన్నాథుని రథయాత్ర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగన్నాథస్వామి ఆలయం నుంచి ఎంపీటీసీ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన నూతన ఇంద్రద్యుమ్న హాల్ వరకు మంగళ వాయిద్యాలు, భజనల నడుమ కన్నుల పండువగా రథయాత్ర సాగింది. అనంతరం అక్కడ సుభద్ర, బలభద్ర, సహేత జగన్నాథుడు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. దశావతారాల అనంతరం వచ్చే నెల 5వ తేదీన తిరిగి ఆలయానికి రథయాత్ర ద్వారా చేరుకోవడంతో జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు పూర్తవుతాయి. తొలి పూజలో వైస్ ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, చిన్నారావు, దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ రథయాత్రలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ,మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు పండా నూకరాజు తదితరులు పాల్గొన్నారు

కదిలిన జగన్నాథ రథ చక్రాలు

చోడవరం: భక్తుల జయజయ ధ్వానాల మధ్య చోడవరంలో శుక్రవారం జగన్నాథస్వామి తొలి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. చోడవరం కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఉపాలయంలో వేంచేసియున్న జగన్నాథస్వామి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి రథయాత్ర సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర,బలభద్రుడు, జగన్నాథస్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య రథయాత్రను శోభాయమానంగా నిర్వహించారు.ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో రథయాత్ర పట్టణ వీధుల్లో సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాస్వామి రథం వద్ద కొబ్బరికాయలు కొట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం ఇక్కడ బోళ్లవీధి రామాలయం ప్రాంగణంలో స్వామివారి దశ అవతార దర్శనానికి ఏర్పాట్లు చేసిన ప్రదేశం వరకూ రథయాత్ర జరిగింది. రథయాత్రలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవంలో గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మత్స్యావతారం

మొదటి రోజు శనివారం మత్స్యవవతారంలో భక్తులకు స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనం భక్తులకు కల్పిస్తున్నామని ఆలయ అర్చకుడు సీతారామాచార్యులు తెలిపారు.

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాదిలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. పలువురు భక్తులు జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. వచ్చే 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ



కె.జె.పురంలో వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందజేస్తున్న డీలర్ ప్రవీణ్‌కుమార్

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 26 వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వచ్చే నెలకు సంబంధించిన రేషన్ సరుకులను ముందస్తుగా పంపిణీ చేస్తున్నట్టు స్థానిక తహసీల్దారు కె.రమాదేవి శుక్రవారం తెలిపారు. మండలంలో 47 రేషన్ డిపోల పరిధిలో రేషన్ కార్డులు కలిగిన 2,901 మంది వృద్ధులు, దివ్యాంగులున్నారని ఆమె తెలిపారు. కాగా ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందించడానికి అయ్యే ఖర్చును రేషన్ డీలర్లు భరించాల్సి వస్తోంది. ఈ వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని డీలర్లు కోరుతున్నారు.

'సంపద కేంద్రాలను' సమర్థంగా నిర్వహించాలి



చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలిస్తున్న సువర్ణరాజు, ప్రసాద్

దేవరాపల్లి: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు సూచించారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో ఎస్.కె.వి. ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను సేకరించడంతో పాటు ఎరువుల తయారీపై దృష్టి సారించాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ సచివాలయం-1ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ అనంత ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుగా రాజా



రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏలు

మాడుగుల రూరల్: మాడుగుల డిప్యూటీ తహసీల్దారుగా కె. రాజా నియమితులయ్యారు. ఈయన గతంలో ఇదే కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు. ఇటీవల చీడికాడ డిప్యూటీ తహసీల్దారుగా డిప్యూటేషన్‌పై నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మాడుగుల డీటీగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దారు లక్ష్మయ్య ఇదే కార్యాలయంలో ఎన్నికల డీటీగా నియమితులయ్యారు. కాగా నూతన డీటీ రాజాకు వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర జేఏసీ కార్యవర్గ సభ్యుడు దోని చిన అప్పారావు , మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు మణికంఠ, కార్యదర్శి సీహెచ్. వెంకటరమణ, ఉపాధ్యక్షుడు అప్పారావు తదితరులు అభినందనలు తెలిపారు.

రీసర్వే డీటీగా త్రిమూర్తులు



కె.కోటపాడు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే డిప్యూ టీ తహసీల్దార్‌గా జె.త్రిమూర్తులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీ చేశారు.రెవెన్యూ సిబ్బంది రీసర్వే డీటీ త్రిమూర్తులుకు అభినందనలను తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ

రావికమతం: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని డిప్యూటీ ఎంపీడీవో స్వామి ఆదేశించారు. గర్నికంలో శుక్రవారం నిర్వహించిన పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. చెత్త నుంచి ఎరువును తయారు చేసి, పంచాయతీకి ఆదాయం సమకూరుస్తున్న సిబ్బందిని,కార్యదర్శి స్వామిని ఆయన అభినందించారు.

కొలువుతీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో నూతన పాలకవర్గం

నర్సీపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో ప్రమాణస్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గవిరెడ్డి వెంకట రమణ, వైస్‌చైర్మన్‌గా చిటికెల కన్నయ్యనాయుడు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గం అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెండు నెలల్లో భూసార పరీక్ష కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యార్డులో కల్యాణమండపం, షాపుల నిర్మాణం చేపట్టి, ఆదాయం పెంపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఆర్డీవో వి.వి.రమణ, కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్ సీహెచ్.పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.విజయ్, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, మార్కెట్ సెక్రటరీ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ సందర్శన

రావికమతం: కొత్తకోట మార్కెట్ యార్డ్‌ను ఎంపీడీవో వెంకన్న బాబు, డిప్యూటీ ఎంపీడీవో స్వామి శుక్రవారం సందర్శించారు. స్థానికంగా ప్రతి రోజూ నిర్వహిస్తున్న మార్కెట్‌ను,శనివారం జరిగే వారపు సంతను యార్డ్ ఆవరణలోకి మార్చారు. ఆ దుకాణాలను ఎంపీడీవో సందర్శించారు. మెయిన్‌రోడ్డును ఆనుకుని దేవాలయాల పక్కనే ఉన్న మాంసం దుకాణాలను తొలిగించాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సర్పంచ్ కోన లోవరాజు,వైస్ సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా ఈ సందర్భంగా ఎంపీడీవోకు వినత పత్రం అందజేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



కొరువాడలో నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి సింహాచలంనాయుడు



చీడికాడలో మందు పంపిణీని పరిశీలిస్తున్న చిట్టినాయుడు



రోలుగుంటలో గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి నూకేశ్వరరావు

కె.కోటపాడు : గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందును వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు తెలిపారు. కొరువాడలో శుక్రవారం 620 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేసే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని వచ్చేనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దేముడుబాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడ: మేకలు,గొర్రెలకు నట్టల నివారణ మందు వేయించాలని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు.శుక్రవారం మండలంలోని తురువోలు, చీడికాడ, ఎల్.బి.పట్నం గ్రామాల్లో 80 గొర్రెలు,375 మేకలకు నట్టల నివారణ మందు వేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 10వ తేదీ వరకు కొనసాగతుందన్నారు.

రోలుగుంట: స్థానిక పశువైద్య కేంద్రంలో శుక్రవారం 124 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలో 14 వేల జీవాలకు నట్టల మందు వేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, నాయకులు మద్దు జగదీశ్వరరావు, పాలకేంద్రం ప్రెసిడెంటు రుత్తల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బందులు

సీపీఐ జిల్లా కార్యదర్శి రాముునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రాముునాయుడు

గొలుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాముునాయుడు అన్నారు. అల్లూరి పార్కులో శుక్రవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాద దాడులు పెరుగుతున్నాయని, ఆపరేషన్ కగార్ కారణంగా అమాయక గిరిజనులు మరణిస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి రాధాకృష్ణ, మేకా భాస్కరరావు,అప్పలనాయుడు, గొలకొండ సత్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగరావు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పని చేస్తున్నా పర్మినెంట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పేరుతో శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ ప్రెసిడెంట్ ఎం.అప్పలనాయుడు, శేఖర్, నాగేంద్ర, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జనను అరికట్టాలి

రావికమతం: బహిరంగ మల విసర్జనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. కార్యదర్శులు,సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, సంపద కేంద్రానికి తరలించేలా కృషి చేయాలని చెప్పారు. పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ఆరా తీస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర వాతావరణంలో అంగన్‌వాడీల నిర్వహణ

బుచ్చెయ్యపేట : పరిశుభ్ర వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె బంగారుమెట్ట,వడ్డాదిలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలు,గర్భిణులు,బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార రికార్డులను,స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం అందలేదన్న ఫిర్యాదులు రాకుండా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. రావికమతం ఐసీడీఎస్ పీవో మంగతాయారు.సూపర్‌వైజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఫోరంఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు

చోడవరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఫోరంఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు అన్నారు. స్థానిక ప్రేమసమాజంలో ఫోరంఫర్ బెటర్ చోడవరం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మెరిట్ మార్కులతో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నిరుపేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందజేశారు. వేచలపు లక్ష్మి, షేక్ అమీర్‌ఉన్నీషా, జొన్నాడ యశశ్రీలకు ఒక్కొక్కరికీ రూ. 5వేల నగదు, బ్యాగ్‌లు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు పూసర్ల రామారావు, వీరన్న పంతులు, శాకా రమేష్, పసుమర్తి సీతారామయ్య, ఆర్క్ ప్రసాద్, ప్రేమసమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు, టి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట పశు వైద్యాధికారిణిగా పద్మజ



బుచ్చెయ్యపేట: స్థానిక పశువుల ఆస్పత్రి వైద్యాధికారిణి జె. పద్మజ శుక్రవారం విధుల్లో చేరారు. మునగపాక మండలం నాగులాపల్లి ఆస్పత్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పశువులకు వైద్యసేవలందేలా కృషి చేస్తానని చెప్పారు.